
ఛే నంబర్ చౌరస్తాలో హనుమాన్ ఆలయంలో...


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు


బాగ్‌అంబర్‌పేటలో.. కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి


గోల్నాకలో.. కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌లు


చిక్కడపల్లిలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


రాంనగర్ రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ

ముషీరాబాద్: హనుమాన్ జయంతి వేడుకలు ముషీరాబాద్ నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా జరిగాయి. హనుమాన్ దేవాయాల వద్ద కాషాయ తోరణాలతో పాటు కాషాయ జెండాలతో ఊరేగింపులు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ, ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రీయనవీన్‌గౌడ్‌లతో పాటు పలువురు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ...

గౌలిగూడ నుంచి ప్రారంభమై తాడ్బన్ వరకు సాగే హనుమాన్ జయంతి విజయోత్సవ ర్యాలీ నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ఆశోక్‌నగర్, ఎల్‌ఐసీ బ్రిడ్జీ, వైస్రాయి హోటల్, ప్రాగా టూల్స్ నుంచి సికింద్రాబాద్‌లోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.


పటేల్‌నగర్‌లో.. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్


వీరన్నగుట్ట హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భార్య కావ్యా కిషన్‌రెడ్డి

రాంనగర్ నుంచి బాకారం వరకు..

అడిక్‌మెట్ అభయాంజనేయ స్వామి దేవాలయం నుంచి బాకారం మీదుగా హరినగర్ గ్రౌండ్ వరకు విజయ యాత్ర ఘనంగా జరిగింది. వందలాది మంది యువకులు ఈ ర్యాలీలో పాల్గొని జై శ్రీరామ్... జై హనుమాన్ నినాదాలతో హోరెత్తించారు. నిర్వాహకులు గడ్డం నవీన్, బీజేపీ నాయకులు నవీన్‌గౌడ్, కె.రవిచారిలతో పాటు పలువురు నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

చిక్కడపల్లి : వీర హనుమాన్ విజయయాత్ర ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లో మంగళవారం అట్టహాసంగా సాగింది. ర్యాలీ మూడు గంటల ప్రాంతంలో ఆర్టీసీక్రాస్ రోడ్స్‌కు చేరుకున్న వీర హనుమాన్ విజయయాత్రకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. చిక్కడపల్లి నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్స్ నుంచి అశోక్‌నగర్ వరకు సాగిన ర్యాలీలో వేలాది మంది స్థానిక ప్రజలు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సింధూర శోభితం..

కాచిగూడ: వాడవాడలా అంజనీసుతుడికి భక్తులు జేజేలు పలికారు. హారతులు ఇచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. ఎటుచూసినా కాషాయ జెండాల రెపరెపలు.. జై శ్రీరామ్.. జైజై హనుమాన్ నినాదాలు హోరెత్తాయి. అంబర్‌పేట నియోజకవర్గంలో హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కాచిగూడ, బర్కత్‌పుర, నారాయణగూడ, లింగంపల్లి, చెప్పల్‌బజార్, నింబోలిఅడ్డ, హరాస్‌పెంట, గోల్నాక, నెహ్రూనగర్, తదితర ప్రాంతాల్లోని హనుమాన్ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వివిధ దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో పలు వీధుల్లో హనుమాన్ శోభాయాత్రలు నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. పలు చోట్ల సాంప్రదాయ సంగీత కచేరీలు ఏర్పాటు చేశారు.


ర్యాలీలో చిన్నారి..


బాగ్‌లింగంపల్లిలో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు


రాంనగర్ రాజ్ ఫంక్షన్‌హాల్ వద్ద మజ్జిగ పంపిణీ


హరాస్‌పెంటలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


ఛత్రపతి శివాజీ, శ్రీరాముడి విగ్రహాలతో..


న్యూ నల్లకుంటలోని విజయ గణపతి ఆలయంలో..


నింబోలిఅడ్డలో శోభాయాత్రలో .. కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్


చెప్పల్‌బజార్‌లో అన్నదానంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నేతలు ఎక్కాల కన్నా, సి.నందకిషోర్ యాదవ్


గోల్నాకలో పూజల్లో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ దంపతులు


అంబర్‌పేటలోని సాయిబాబా మందిరంలో.. ఆంజనేయుడికి ఆకు, వడమాల పూజలు


కాచిగూడ లోని ప్రసన్నాంజనేయ గుడిలో సత్యనారాయణ స్వామి వ్రతంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

5వేల మందికి అన్నదానం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శ్రీ బాలాజీ భక్త సమాజం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీరాముడు, ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ , ఎమ్మెల్యే ముఠా గోపాల్, బాలాజీ భక్త సమాజం అధ్యక్షుడు పలుస బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా భూ అలంకరన్ దివస్


వర్క్‌షాపులో పాల్గొన్న చిన్నారులు, నిర్వాహకులు

కాచిగూడ: సంస్కార భారతి ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడ, రాజేంద్రనగర్ కమ్యూనిటీ హాల్‌లో భూ అలంకరన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు రంగోలిపై వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. 30 మందికి పైగా చిన్నారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను చాటుకున్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్త నిరంజన్, సరోజ్‌బాల ఠాకూర్ మాట్లాడుతూ, భూమిని కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ వర్క్‌షాపులో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భూ అలంకారన్ విధా ప్రముఖ్ జయశ్రీ సులకే, జ్యోతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ డిస్పెన్సరీలకు నిధులు మంజూరు చేయాలి

ముషీరాబాద్: అద్దెలు చెల్లించకపోవడంతో ఈఎస్‌ఐ డిస్పెన్సరీలు మూతపడుతున్నాయని వాటికి వెంటనే నిధులు మంజూరు చేసి మూతపడిన డిస్పెన్సరీలను తెరిపించాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటి కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు లేఖను రాశారు.

చేవెళ్లలో బీఆర్‌ఎస్‌దే గెలుపు


కాళీమందిర్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

బండ్లగూడ: చేవెళ్ల గడ్డపై మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్ ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మంగళవారం నామినేషన్ వేసిన సందర్భంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. అంతకుముందు కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలుపొందాలని కాళీమందిర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, నాయకులు నవాబు ముంతాజ్, పార్టీ అధ్యక్షులు అంతారం నరేశ్, సుమన్‌గౌడ్, సుందర్‌గౌడ్, జగదీశ్, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు ముందుకు సాగాలి


మహనీయుల జయంత్యోత్సవంలో పాల్గొన్న కాశీం, లక్ష్మణ్‌నాయక్

బంజారాహిల్స్: సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మహనీయుల జయంత్యోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయులను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు ముందుకుసాగుదామని ప్రతినబూనారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్. అరవింద్, డాక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు డిపార్ట్‌మెంట్‌కు చెందిన సీ.కాశీం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన మహనీయుల జీవిత చరిత్ర స్ఫూర్తిదాయకమన్నారు. వారి త్యాగాల గురించి నేటితరం తెలుసుకుని వారి బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జే లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ నవనీత, వైస్ ప్రిన్సిపాల్ (హాస్టల్స్) వెంకటరమణ, ఎం.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ప్రజాస్వామిక విలువలు నశించాయి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దొమ్మాట వెంకటేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో ప్రజాస్వామిక విలువలు నశించాయని సకల జనుల చర్చావేదిక కన్వీనర్ దొమ్మాట వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సకల జనుల చర్చా ఆధ్వర్యంలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా మత రాజ్యం కొనసాగుతోందన్నారు. బీజేపీ పాలన అంతా మతం పునాదుల మీద నడుస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాపై ఆధారపడుతూ బీజేపీ ప్రజలను మభ్యపెట్టే విధంగా ప్రచారం చేస్తోందని విమర్శించారు. అన్నారు. కార్యక్రమంలో సకల జనుల చర్చావేదిక కోకన్వీనర్ నవారీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్.హరిత్‌రూడా, జి.శ్రీహరి, గోరా శ్యామ్‌సుందర్‌గౌడ్, డాక్టర్ తడక యాదగిరి, రామగిరి ప్రకాష్ తదితరులు సంగించారు.

బెల్టు షాపులను నియంత్రించాలి


ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న పిఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు

ముషీరాబాద్: బస్తీలు, పల్లెల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టు షాపులను నియంత్రించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ), ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) ప్రతినిధుల బృందం ప్రొహిబిషన్, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌ను కలిసి మంగళవారం నాంపల్లిలోని అబ్కారీ రాష్ట్ర కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో బెల్టు షాపులు వేలల్లో వెలిశాయని వాటిని అరికట్టకపోగా విస్తృత పరిచిందని ప్రస్తుతం రాష్ట్రంలో బెల్టు షాపులు నాలుగు వేలకు పైగా ఉన్నాయని తెలిపారు. దీంతో బస్తీలు, గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుందని పాన్‌షాపులు, కిరణా షాపుల్లో సైతం విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని దీంతో యువత మద్యానికి బానిస అవుతుందని వివరించారు. కార్యక్రమంలో పిఓడబ్ల్యూ పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు డి.స్వరూప, కె.ఎస్.ప్రదీప్, లక్ష్మీబాయి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట ఓటర్ల మొగ్గు ఎటో!

- గత ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక మెజార్టీ
- తాజాగా ప్రచారంలో ముందున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి
- కానరాని కాంగ్రెస్ ప్రచారం
- బీఆర్ఎస్ ఆశలన్నీ ఎమ్మెల్యే పైనే



అంబర్‌పేట: లోక్‌సభ ఎన్నికల సందడి ప్రారంభమైంది. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే అంబర్‌పేట నియోజకవర్గం ఓటర్లను ఆకట్టుకోవడానికి ఆయా పార్టీలు సమయాత్తం అవుతున్నాయి. నియోజకవర్గంలో సుమారు 2.80 లక్షల ఓట్లు ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 56 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మైనార్టీలతో పాటు భిన్న వర్గాల ఓటర్లు ఉన్నారు. ఐదు మున్సిపల్ డివిజన్లతో ఉన్న అంబర్‌పేట నియోజకవర్గంలో ఒక్కో డివిజన్‌లో ఒక్కో రకమైన ఓటర్ తీర్పు నమోదవుతోంది.

- కాచిగూడ డివిజన్‌లో ఎక్కువగా ఉత్తర భారతీయులు ఉండగా నల్లకుంటలో ఉన్నత, అగ్రకులాలు నివసిస్తారు. బాగ్ అంబర్‌పేటలో కొన్ని కాలనీల్లో అగ్రకులాలు ఉండగా, మిగతా ప్రాంతాలు బీసీ సామాజిక వర్గ ఓటర్లు ఉన్నారు. అంబర్‌పేట, గోల్నాక డివిజన్లలో బీసీ, మైనార్టీలు అధికంగా ఉన్నారు. స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో భిన్నమైన తీర్పులు వెలువడ్డాయి.

తాజాగా పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లు ఎటువైపు ఉంటారో వేచి చూడాల్సిందే.

ముందంజలో బీజేపీ...

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటినుంచి స్థానిక ఎంపీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. పార్టీ టికెట్ అతనికే ఖాయం కావడంతో ఎన్నికల పనులను ప్రణాళికాబద్ధంగా మొదలు పెట్టారు. ఇతర పార్టీలకు భిన్నంగా ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే అంబర్‌పేట నియోజకవర్గంపై కిషన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి రెండు దఫాలు చుట్టేశారు. అంబర్‌పేట ఆయనకు సొంత అసెంబ్లీ నియోజకవర్గం కావడంతో ఇక్కడే మెజార్టీ ఓట్లు సాధించుకునేందుకు తనదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంబర్‌పేటపై ఆయన పూర్తి విశ్వాసంతో ఉన్నారు. బీజేపీకి సహితం అంబర్‌పేటలో ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది.

అధికార కాంగ్రెస్ పార్టీ అంతంతే...

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అంబర్‌పేటలో మాత్రం ఇప్పటి వరకు ప్రచార పర్వం ప్రారంభం కాలేదు. నామ్‌కే వస్తేగా కార్యకర్తల సమావేశంతోనే ఇప్పటివరకు నడిపించారు. అంబర్‌పేటలో గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పెద్దగా ఉనికి చాటుకోవడంలేదు. అధికారంలోకి వచ్చినప్పటికీ అంబర్‌పేటలో మాత్రం అంతంతే ఉంది. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా దానం నాగేందర్ పేరును కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసినప్పటికీ ఆయన ఇంకా నామినేషన్ వేయకపోవడంతో సదిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలోనే పార్టీ శ్రేణులతో పాటు ప్రజల్లోనూ పెద్దగా స్పందన లేదు.

బీఆర్ఎస్ భారం ఎమ్మెల్యేపైనే...

బీఆర్ఎస్ పార్టీకి నియోజకవర్గంలో బలం ఉండటంతో ఓటర్లు ఎటువైపు మొగ్గుతారో అనేది ఆసక్తిగా మారింది. ఇక్కడ తమ పార్టీ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఉండటంతో అతడిపైనే బీఆర్ఎస్ ఆశలు పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే సైతం ఇప్పటికే ఐదు డివిజన్ల పార్టీ నాయకుల సమావేశాన్ని నిర్వహించి ఎన్నికలకు సన్నద్ధం చేశారు. పార్టీకి మెజార్టీ ఓట్లు సాధించి తమ సత్తా నిరుపించుకోవాలని ఆయన పార్టీ శ్రేణులను కోరుతున్నారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఆదరణ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఏ మేరకు వస్తుందో వేచి చూడాల్సిందే.

కొత్తగూడెంలో పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్

ముషీరాబాద్: భద్రాది కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 27వ తేదీన పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.సాంబ తెలిపారు. జనరల్ కౌన్సిల్‌కు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు సుమన్, అఖిలేష్, ప్రసాద్, లావణ్య, వైష్ణవి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సాంబ, వెంకట్‌రెడ్డి, సతీష్, రత్నం, రమేష్‌లను పీడీఎస్‌యూ నుంచి బహిష్కరించామని కానీ వారు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించడం హాస్యస్పందమని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశాలకు మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

గుండెపోటుతో అసోసియేట్ ప్రొఫెసర్ మృతి

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ కారుమంచి నిర్మల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నెల 20న అర్ధరాత్రి గుండెపోటు రావడంతో ఆమెను నాగోల్‌లోని సుప్రజ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు.

ఐపీఎల్ టికెట్ల విక్రయాలపై బీసీసీఐకు ఫిర్యాదు

హిమాయత్‌నగర్: ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల టిక్కెట్ల విక్రయం క్రికెట్ వీక్షకులకు పారదర్శకంగా చేరడం బీసీసీఐకు ఈమెయిల్ ద్వారా లేఖ పంపించినట్లు మంగళవారం ఏఐవైఎఫ్ నేతలు తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్రలు మాట్లాడుతూ టికెట్లను సెలబ్రిటీలు, ప్రభుత్వ అధికారులకు ఇస్తున్నారని ఆరోపించారు.